



ఇచ్ఛాపురపు జగన్నాథరావు

కథానిక

వరండాలో కూర్చుని రోడ్డుమీద వొచ్చిపోయే వాళ్ళని చూస్తూ ఆలోచించుకుంటూంది శ్యామల.

జీవితంలో మనిషికి అన్నీ విచారాలే నను కున్నది... నీరసంగా నవ్వుకుంటూ ఆ యువతి. ఈ మనుషులూ, ప్రపంచమూ, విజ్ఞానమూ... అన్నీ బాధా కారణాలే ననిపించాయి... మరీ అన్యాయం జరిగిపోయి లోకంమీద మమత అయినా పోవాలి. గొప్ప అదృష్టంకొద్దీ ప్రతీకోరికా తీరడానికి, ప్రతీ ఆశా నిజంకావడానికీ వీలైనా కావాలి... ఈ రెండూ లేనినే మిగిలేవి ఆశలూ. వాటి వెనకాలే నిరాశల నిట్టూర్పులూ—కలలూ, వాటివెనకాలనే తెలివివొచ్చి తెల్లబోవడమూ...

ఉదయంలేచి నాలుగుపనులూ చూసుకునేసరికి గంట పట్టదు. తీరిక. హరి బయలుదేరి వెళ్ళేక ఇంట్లో తానొక్కర్తీ మిగులుతుంది ఒంటరిగా— ఇంత ప్రపంచంలో అతను పన్నెండుకో, ఒంటి గంటకో తిరిగివస్తాడు. ఆ నాలుగైదు గంటలూ ఎన్నో సంవత్సరాలుగా గడిచాక...

మళ్ళా మూడునించి పదిదాకా ఈ విపరీత మైన ఒంటరితనం ... ఏవో చదువుతూ ఎన్ని గంటలని నెలలతరబడి గడపడం! నోరులేని స్నేహితులు ఆ పుస్తకాలన్నిని ఎక్కడికని వాటి ఓదార్పు తనకి! మనుషులై పుట్టాక, ప్రతీ మనసులోనూ కోరికలుంటాయి. కాని, తాను జీవితాన్ని అడిగినది గొప్పదీ, అసాధ్యమూ ఏమీ కాదు... తానుచెయ్యని తప్పుకి తనని బాధించవొద్దన్నది... ఇంత ఒంటరితనం — ఇంత శిక్ష తాను చెయ్యనిదానికి అన్యాయం అను కున్నది.

ఇలాగే జీవితం గడపడం అంటూఉండదు... తనకి తెలిసినవాళ్ళందరూ తనని వెలివేశారు. తనని తెలియనివాళ్ళు తొందరగా తెలుసుకుంటున్నారు.

ఇలాటి ఒంటరితనంలోనే, ఇలాటి దుఃఖం లోనే తన యవ్వనం తనని బలిఇచ్చింది మొదటి శిక్షకి .. ఒక్క మనసైనా తనదనుకోవడానికి తహ తహ పడినప్పుడు రాజు తనకి ఎంతో మంచి వాడుగా, ప్రాణం ఇచ్చేంత అభిమానం ఉన్న వాడిలాగ కనిపించాడు. తానేం చేస్తుందని! ఆ రోజుల్లో తనబ్రతుకు ఎడారిమల్లే ఉండి, ఉరి పోసుకుని చచ్చిపోదామనేంత ఒంటరిగా ఉండేది. ఇన్నికథలలోని రాజకుమారులు తన ఛాయల్లోకి రాలేదు... రాజు తనకి దొరికేదాకా...

యమకూపాలనించి ఒక్కసారి నందన వనంలోకి పడినట్లయింది తనకి... ఇన్నాళ్ళనించి తనలో నిద్రించిన కోరి

కలూ, ఆశలూ, కలలూ, బలంగానిజం అవుతోన్నట్లనిపించింది తనకి...

"నువ్వు దేవతవి శ్యామలా!" అనేవాడు రాజు తన వొంక చూస్తూ తానేమైనా ఇంట్లో ఎప్పుడూ అక్కరలేదు. రాజు గంటల తరబడి తన వైపు చూస్తూ కూర్చునేవాడు. అతనికేమి కావాలోనని ఆశ్చర్యపడేది తను కాని, జవాబు వొచ్చేదికాదు. తనలో తానే సమాధానం చెప్పుకుని వెన్నెలతో నిండిపోయిన మనసుతో గంటలూ గంటలూ గడిపేది తను. రాబోయే స్వర్ణదినాలు తలుచుకుంటే లోకమంతా తనతో మైత్రిచేసుకున్నట్లే అనిపించేదితనకి.

కాని, తన రహస్యం ఒక్కసారి వెలికి వచ్చాక ఇదంతా మారిపోయింది. తన ప్రణయం బ్రతుకంతా దాని ఏకాంతతలోనే ఉందని ఆమె ఎప్పుడు గుర్తించలేదు. ఈ మధురక్షణాలు శాశ్వతం అవుతాయనీ, రాజు చెప్పే తియ్యటిమాటల్లో అతని హృదయంలోని కలల పలకరింపులనీ ఆమె అనుకున్నది కాని.

అప్పటిదాకా ఎవ్వరికీ అక్కరలేని తను, ఇప్పుడు అందరికీ దుయ్యబట్టడానికీ, వ్రేలెత్తి చూపడానికీ కావలసి వొచ్చింది. నాన్న చితక్కొట్టాడు. ఆ రాత్రి తాను పెరట్లో రాజుతో ఉండడంచూసి అమ్మకొట్టలేదు—కానీ, కొడితేనే బాగుండునని పించింది.

ఇందులో పెద్ద పొరపాటు జరుగుతోందని తనకి తెలుసును. "రాజు నన్ను పెళ్ళిచేసుకుంటాడు—" అంది తను.

అప్పుడు అమ్మని చూడాలి—ఇప్పటికీ తాను మరిచిపోదు—"అవునవును. ఒక్కర్తిని పోషించలేడూ రెండోది."

అప్పటికి కాని, ఈ ప్రణయపు తత్వం తనకి పూర్తిగా తెలిసి రాలేదు. ఆ వెన్నెల రాత్రులూ, తియ్యటి కౌగలింతలూ, ఆప్యాయపు పలకరింతలూ ఒక వేపూ, ఇంట్లోవాళ్ళూ బయటివాళ్ళూ తనని అనేమాటలు మరో వేపూ మనుషులు విషం ఎందుకు తాగుతారో, ఉరిపోసుకునే తెగింపు వీళ్ళకెట్లా వొస్తుందో తెలిసేలా చేశాయి తనకి. రాజుని తలుచుకున్నప్పుడల్లా విపరీతమైన కోపం, తన అసహాయత్వానికి దుఃఖంవచ్చేవి. వెనువెంటనే తాను కలగన్న స్వర్గాలూ; వాటిలో తన క్షణిక విహారాలూ జ్ఞాపకం వొచ్చి మనసు పిండినట్లయిపోయేది.

అప్పుడు ఎందుకనో తమ ఇంటికి వొచ్చాడు హరి. అతనూ అప్పుడే మెడికల్ పాసయ్యాడు. హౌస్ సర్జన్ చేస్తూ సెలవులో వొచ్చాడు.

ఆనాడు తన మనసు మరీ ఏడిచి ఏడిపిస్తోంది. అమ్మ ఉద్దేశం-ఒకక్షణం, తనని అతనికివ్వాలని ఆ మాటే ఉదయం అంది తనతో ఆమె స్వంత పద్ధతిలో. "వీడి అదృష్టం బాగుందిలే. లేకుంటే నిన్నే కట్టుకునేవాడు."

నిజమే. అవమానాలకీ, నీచత్వానికీ అంటరానిదైపోయిందితాను. ఈ బాధల అపరిమితత్వం తన చుట్టూ చీల్చలేని ఉక్కు తెరలని ప్రకటించాయి. ఏంచెయ్యాలో తెలీదు తనకి-చచ్చిపోవాలని లేదు. ధైర్యంలేదు. బ్రతకడానికి తనకి హక్కుపోయింది. ఈ రెండిటి మధ్యాపడి బ్రతుకులో గంటకి పది చావులు చస్తోందితను.

ఇవన్నీ తలుచుకుంటూ ఆరాత్రి తనకి మరీబాధ అనిపించింది. నిద్ర పట్టక వొచ్చి ఆరుబయట కూర్చుంది. వెన్నెట్లో మరపురాని జ్ఞాపకాలు సంపంగిని కౌగలించుకున్నట్లు బోధిస్తున్నాయి.

అతనువొచ్చి తన వెనకాల నిలబడ్డట్లు తనకి తెలియనేలేదు..."శ్యామలా!" అని పిలిచేదాకా.

త్రుళ్ళిపడ్డది తను. ఒక్కసారి పరిస్థితిలోని ప్రమాదం తనకి తెలిసి వొచ్చింది. ఎవరన్నా తనని చూస్తే తన ప్రయత్నం అక్కరలేకుండానే విముక్తి.

లేచి లోపలికి పోబోయింది—కాని, హరి తనని కూర్చోబెట్టాడు. నీరసంగా కూలబడ్డది తను అతను ఏం చెయ్యదలుచుకున్నాడో!

"ఒక్క ప్రశ్న అడుగుతాను శ్యామలా...జవాబిచ్చి వెళ్ళిపో" అన్నాడు.

బెదిరిపోయి చూసింది తను—అతని కళ్ళలో క్రౌర్యంలేదు. తన చేతిమీదఉన్న అతని చేతిలో కాఠిన్యంలేదు...ఇన్ని దుఃఖాల మధ్య, ఇన్ని అవమానాలమధ్య, ఇంత భయంమధ్య అతను అమృతమూర్తిలాగ కనిపించాడు. కాని—ఆ మంచితనమే తనకెంత బాధ పెట్టిందని!

జలజల కళ్ళనీళ్ళు వొచ్చేశాయి తనకి—తన నిస్సహాయస్థితి తల్చుకుని తాను చెప్పక్కర లేకుం

డానే అతనికి నిజం తెలుసును. కాని, పాపం! తనని ప్రశ్నిస్తాడు.

"వొద్దు శ్యామలా...నీ కథ అంతా నాకు తెలుసును—నేనడిగేది దాన్నిగురించి కాదు. చెప్పు—నన్ను పెళ్ళి చేసుకుంటావా?"

కలగంటున్నాననుకుంది తను...హరి...అంత వాడు తనని అట్లా అడగడం...హేళన చేస్తున్నా డనుకుంది తను...మరీ ఏడుపు వొచ్చింది తనకి...

కాని, అతను మళ్ళా అడిగాడు—ఎంతో అభిమానంగా, నిజంగా...

ఏం చెప్తుంది తను!...అతని రెండుపాదాలకీ తన కన్నీళ్ళ అభిషేకం చేద్దామనుకుంది. అతని రెండు చేతులూ కట్టుకుంది ఆ భావోద్రేకంలో... ఒక్కసారి సముద్రం అయిపోయింది మనసు...

మర్నాడు హరి వెడుతూ అమ్మతో చెప్పేడు. "నీకు మతిపోయిందా?—మీ నాన్న పీకపోయినా ఒప్పుకోడు" అంది అమ్మ.

"చూస్తాన్లే" అన్నాడు హరి.

వెడుతూ—"నీకథ అంతా నాకు తెలుసును శ్యామలా...అందులో వైపరీత్యం ఏమీ లేదు. నేను ఉత్తరం రాస్తాను. ఈ నెలలోనే పెళ్ళి అయిపోతుంది" అన్నాడు.

తాను ఏమీ అనలేదు. అమ్మ మాటలు విన్నాక అతను మళ్ళా కనపడడని తనకి తెలిసివచ్చింది. తన లాటి చరిత్ర ఉన్నమనిషిని ఎవరు కట్టుకుంటారని!

పదిరోజులు పోయేసరికి తన భయాలన్నీ నిజమయేయని తెలిసి వొచ్చాయి శ్యామలకి—హరి ఉత్తరం రాయలేదు.

అందరూ అంతే...అనుకుంది తను. కాని తరవాత వారంలో ఒకనాడు మధ్యాహ్నం హరి హఠాత్తుగా వచ్చి "నాన్న ససేమిరా అన్నాడు" అని చెప్పడంతో తన బ్రతుకు నిశ్చయంగా వీథి పాలైందని తెలిసింది శ్యామలకి. ఈసారి తాను ఏడవనూ లేదు.

హరి తిన్నగా తన గదిలోకి వొచ్చి "నీ భయం నాకు తెలుసును శ్యామలా! కాని నన్ను నువ్వు తెలుసుకోలేవు!" అన్నాడు.

అతను అందరినీ వొదులుకుని తనని పెళ్ళిచేసుకోడానికి సిద్ధపడి వొచ్చాడు—తన కిష్టమైతే, ఆ సాయంత్రమే రైలెక్కి, మర్నాడు దేవుడి గుడిలో పెళ్ళి చేసుకోడానికి...

ఆ సాయంత్రం అతనితో బయలుదేరి వెళ్ళిపోయింది తను. అందరూ తనని తిట్టారు. తన ముఖం చూడమన్నారు—కాని,

ఆ సాయంత్రం!

ఆ రాత్రి!

ఇంకా, ఆ మర్నాడు!

అతనంతా ఏర్పాటుచేసి ఉంచాడల్లే ఉంది. తమ పెళ్ళి కెవ్వరూ రాలేదు—కాని, అంతా సరిగా అయిపోయింది. కెరటాలల్లే వొస్తూన్న ఆలోచనలు పేపరువాడి కేకతో ఒక్కసారి మళ్ళా ప్రస్తుతానికి వొచ్చాయి. ఏవో మ్యాగజైన్లూ, పేపరూ తన కిచ్చి వాడు వెళ్ళిపోయాడు.

కొంతసేపు పేపరు చూసి, కొంతసేపు పత్రికల కాగితాలు తిప్పింది. కాని, అటు మనస్సుపోలేదు తనకి. ఎందుకనో ఇవాళ తన జీవితంలో జరిగిన వన్నీ ఈ ఒంటరితనంలో బలంగా, భయంకరంగా జ్ఞప్తికి వొస్తున్నాయి తోసుకొస్తూన్న కెరటాల మల్లే.

అయినా, ఆ తరవాత తన జీవితం సాఫీగానే జరిగిపోయింది. హరి ప్రాక్టీసు పెట్టేడు తన కోర్కెపూర్తి చేసుకుని. నాడూ నేడూ తనని ఆ ఆప్యాయతతోనే, ఆ గౌరవంతోనే చూస్తున్నా డతను. ఆ పూర్వపు బాధలూ, ఆ అశాంతీ ఈనాడు తనకి కలల్లాగ కనిపించేలాగ.

కాని, లోకానికి వెలి అయిపోయారు తామిద్దరూ—ఎవ్వరూ తమ ఇంటికి రారు. ఈ చిన్న ఊళ్ళో అందరికీ తనమీద అసహ్యమే ననుకున్నది శ్యామల. ఒకసారి ఏదో ఊరు వెడుతోంటే పార్వతి కనిపించిది రైల్లో.

ఆప్యాయంగా పలకరించింది తను. ఆడవాళ్ళ కేరేజీలో ఇద్దరూ కలిసేసరికి, ప్రాణం లేచివచ్చినట్లయింది తనకి.

కాని, ఎంతో దూరం అయిపోయినట్లు మాట్లాడింది పార్వతి. అప్పుడు తనంటే ప్రాణం ఇచ్చిన మనిషి...తానేం చేసిందని

"ఏమీ అనుకోకు శ్యామలా!...వచ్చే స్టేషనులో మావారు వొస్తారు...ఆయన చూస్తూండగా పలకరించకు..."

రైలు చక్రాల కింద తనని తోసినంత బాధ పడ్డది తను... అందరూ తనని లేచిపోయిన మనిషిగా జమకట్టారు. పార్వతికూడా!

భరించలేని ఆవేదన పడ్డది తను...

"పానీ—హేమ ఎక్కడ ఉంది?" అంది తను—అంతరాంతరాలలో ఆరిపోని ఆశ—ఈ లోకంలో—ఇంత పెద్ద ప్రపంచంలో, తన సాహచర్యం ఎవ్వరికి అక్కరలేదా అని—తన బ్రతుకులోని ఈ బాధలు ఎవ్వరికీ అక్కరలేదా అని...

చెప్పింది పార్వతి—"అతను ఆ ఫ్యూళ్ళోనే లెక్చరరు. కేరాఫ్ అని రాయి" అని.

సగం అనుమానంతోనే రాసింది శ్యామల. నాలుగురోజులయాక జవాబు...

గట్టిగా కళ్లు మూసుకుంది శ్యామల అవన్నీ తలుచుకుని. భగవాన్! అనుకున్నది.

కాలం ఇట్లానే గడుస్తోంది... శ్యామలకి అన్నీ ఉన్నాయి—ఏమీ లేదు.

ఈ పరిస్థితిలోనించి ఒక్కసారి విముక్తివొస్తుందని శ్యామల అనుకోలేదు—ఆమె అనుకున్నట్లు ఏమీ జరగలేదు ఎప్పుడూ—అనుకోనివి జరుగుతూనూ ఉన్నాయి.

ఆ సాయంత్రం హరి ఇంటికిరాగానే, "కృష్ణమూర్తికి ఈఫ్యూళ్లో వుద్యోగం అయిందిట. ఇవాళ కనిపించాడు" అన్నాడు.

"వాళ్ళందరూ..." అన్నది శ్యామల.

"అతనూ, భార్యా, పద్మా—అతని చెల్లెలు నువ్వు చూస్తావుగా! రేపు వొస్తామన్నారు. నిన్ను చూడాలని ఉందట!" అన్నాడు.

"నిజంగా!" అన్నది శ్యామల—సంతోషం ఆపుకోలేక.

తన బాధ అతనికి తెలుసును. "అవును శ్యామలా... నిజంగానే వాళ్ళ ఇంటికి వెళ్ళివస్తున్నాను. అందరు మనుషులూ ఒక్కలాగ ఉండరుగా!" అన్నాడు హరి.

ఆ మర్నాడు శ్యామలకి తీరుబడి లేకపోయింది. ఇంట్లో అన్నీ వాళ్ళ రాకకి సిద్ధం చెయ్యడంతో. హోటలునించి స్వీట్స్ తెప్పించింది—ఇంట్లో ఫలహారాలూ కాఫీ తయారుచేసింది. ఇల్లంతా పండగకి మల్లే అలంకరించింది.

ఆ సాయంత్రం అంతా తియ్యటి కలలాగ సాగిపోయింది శ్యామల. అందరూ తనతో ఎంతో గౌరవంగా, అభిమానంగా మాట్లాడారు. ముఖ్యంగా పద్మ ..

"మీ ఇల్లెంత బాగుందండీ!... ఎన్ని పువ్వులు! పుస్తకాలు..."

ఆమె ఆడిన ప్రతీ మాటా సంగీతంలాగ వినిపించింది శ్యామలకి. తనకి ఒక చెల్లెలు నిజంగా ఉంటే, ఆమె తనని ప్రేమిస్తే, అంతకన్న పద్మ ఏమీ తీసిపోలేదు. తరతరాల తన ఆవేదన ఆమె మాటల్లో, స్నేహంలో చల్లారింది.

"తరుచు వొస్తూ ఉండండి—"

అన్నాడు కృష్ణమూర్తి. భార్యతోకలిసి అంత చక్కటి మాటలు ఎప్పుడూ వినలేదనిపించింది శ్యామలకి. పద్మ మరీ బలవంతంగా శ్యామలని మర్నాడు రమ్మని వొప్పించి మరీ వెళ్ళింది.

ఆ రాత్రి నిద్రపట్టలేదు శ్యామలకి-అంత ఆనందంతో ఏంచేసుకోవాలో తెలియలేదామెకి. తను పతితకాదు. లేచిపోయిన మనిషికాదు. తనకీ స్నేహితులూ, పలకరించేవారూ, ఆప్యాయంగా మాటలాడేవారూ ఉన్నారు!

ఆ రాత్రి హరికే నిద్రపట్టలేదు. కళ్ళు తెరిచినా, మూసినా, అతనికి నిండుయవ్వనంలో, విలాసంగా చిరునవ్వు నవ్వుతోన్న ఆ సుందరి జ్ఞాపకం వొచ్చి మనసు పరిపరి విధాలుగా పోతోంది. తాన్ను కాఫీ అందిస్తూ ఆమె వ్రేళ్ళు తాకినప్పటి ఆమె చూపు తియ్యగా, వెన్నెల వర్షం మల్లే జ్ఞాపకం వొస్తోంది. అందరూ బయటికి వెళ్ళేక ఆమె తన దగ్గర సెలవు తీసుకుని బయటికి నడవడం ఇప్పటికీ తనకి జ్ఞాపకం ఉంది. నీలి ఆకాశంలో తేలుతోన్న మేఘంలాగ ఎంత అందంగా ఉంది పద్మ!

ఈ ఆరునెలలూ శ్యామలకి చాలా ఆనందంగా గడిచిపోయాయి. పద్మ సుమారు ప్రతి రోజూ వొచ్చి వెళ్ళేది. తానూ హరీ ప్రతివారమూ వాళ్ళ ఇంటికి వెళ్ళేవారు. ఎంతో ఆప్యాయంగా మాటలాడుకునేవారు. ఇంక కోరదగిన దేమీ లేదనుకున్నది శ్యామల. ఆ రోజు ఉదయం ఎక్కడో గవర్నమెంటు డాక్టరుగా హరికి ఆఫర్ వచ్చింది.

"ఎందుకూ అంతదూరం? ఇక్కడే బాగుంది" అంది తాను.

హరి ఉద్దేశమూ అదే!

మళ్ళా ఇంకో ఊరువెళ్ళి ఈ ఆనందం అంతా పోగొట్టుకోవా లనిపించలేదు శ్యామలకి. ఎక్కడ ఐతేనేం! ఇక్కడ రాబడే ఉంది. తమకి స్నేహితు లున్నారు ముఖ్యంగా. ఆ సమస్య చాలా తేలికగా పోయింది.

ఆ సాయంత్రమే పిడుగుపడ్డది శ్యామల కట్టుకున్న బొమ్మరింటిమీద.

ఆ రోజు ఆమె మామూలుగానే కృష్ణమూర్తి ఇంటికి వెళ్ళింది. అతని భార్య ఎందుకనో కొంచం వింతగా కనిపించింది శ్యామలకి.

"పద్మ ఏదీ?" అలవాటుగానే అడిగింది తను.

"మీరు దాన్నిగురించి అడగడం మానుకోవాలి" అన్నది ఉమ. ఏమిటిది? ఏమిటిది?

"అది మీయింటికి రావడం మానెయ్యాలని ఆయన చెప్పేరు...నేనూ అంతే...అది పెళ్ళి కానిపిల్ల..."

తెల్లబోయింది తాను.. ఎందుకిట్లాగ అందరూ మారిపోయారు?...

ఒక్కసారి తెలిసొచ్చింది తనకి. వీళ్ళకి నిజం ఇప్పుడు తెలిసింది. వాళ్ళ చుట్టాలు .....

ఎలాగోవొచ్చి ఇంట్లోపడ్డది శ్యామల...ఎన్ని అవమానాలనో తాను సహించింది. కాని ఇంత బాధ ఎప్పుడూ పడలేదు తాను...

వెక్కి వెక్కి ఏడుస్తోంది అలాగే పడుకుని—హరి వొచ్చేసరికి.

"ఏమిటి జరిగింది?" అన్నాడు హరి ఆతృతగా తనని లేవదీస్తూ.

తనని ప్రేమిస్తోన్న ఒక్కడూ అతను...

చెప్పింది శ్యామల—జరిగినదంతా. "వాళ్లు నేనంటే అసహ్యపడుతున్నారు" అని ఏడ్చింది.

"పోనీ శ్యామలా!...మనం ఉన్నాంగా!"

తేరుకుని లేచి కూర్చుంది శ్యామల—చుట్టూ ఇంటి నిశ్శబ్దం...బయట వెన్నెల బాగావొచ్చింది.

"మనం. పోదాం." అన్నది చివరికి.

ఈ బాధల చీకటిలో, నిష్క్రమణం ఒక్కటే వెలుతురులాగ కనిపించింది శ్యామలకి. ఆ వూరుకి దూరం ఇంకా ఎక్కువైతే బాగుండుననిపించింది. ఎవ్వరూ లేనిచోటికి...ఎవ్వరికీ తాము తెలీని చోటికి...

"అలాగే శ్యామల!...పోదాం!" అన్నాడు హరి.

కృతజ్ఞతతో బరువెక్కిన కళ్లతో అతనివైపు చూసింది శ్యామల. అతను తనని ప్రేమించాడు... తనకి జీవితం ఇచ్చాడు...తనకి అన్నీ ఇచ్చాడు.... తన అన్నీ వొదులుకుని.

"ఎంత మంచివారు మీరు!" అన్నది శ్యామల మనసారా—ఆ ఉద్రేకంలో ఆమె కంఠంగాద్గదికం ఐపోయి, కళ్లునీటితో నిండిపోయాయి.

ఆమె కళ్లునీటితో నిండిపోయాయి. చుట్టూ మసకవెల్తురు మాత్రమే ఉంది. ఆమె మనసులో వివిధభావాలు బలవత్తరంగా యుద్ధం చేస్తున్నాయి.

కాకపోతే హరి మొహమీద తేరినట్లూ. అతని కళ్ళలోని భయమూ, అంతరాంతరాలలో అతను అనుభవిస్తోన్న అవమానమూ శ్యామలకి కనిపించి ఉండేది. వాటి కారణమూ ఆమెకి తెలిసి ఉండేది.

కాని—ఆమె కళ్లునీటితో నిండిపోయాయి. మనసూ దుఃఖంతో నిండిపోయింది. అందుకనే ఆమె ఇవేవీ చూడలేకపోయింది.

---

రచయిత అన్నవాడి బాధ్యత కేవలం పుస్తకంవ్రాసి అచ్చువేయించడమే కాదు; అతడి బాధ్యత సత్యాన్ని అన్వేషించడం; మానవుడి గురించిన సత్యాన్ని ప్రకటించడం. మానవుడి జీవన సమస్యలు ప్రస్ఫుటపరచి, అతడిలో అంతర్గతంగా ఉన్న ధైర్యాన్ని వెలికితీయడం; ఇంకా యింకా ధైర్యవంతుడిని చేయడం; అతడు యిప్పుడుంటున్న దానికంటె యింకా కారుణ్యమూర్తిగా చేయడం; అభిలషిస్తు దానికంటె యింకా తక్కువ స్వార్థపరుడిగా చేయడం.—రచనలద్వారా యివి సాధించడమే రచయిత బాధ్యత.—విలియమ్ ఫాక్‌నర్